క్లుప్తంగా

జాంబవంతుడికి పూజలు



ప్రత్యేక అలంకారంలో జాంబవంతుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మనగర్‌లో వెలసివున్న జాంబవంతుడి ఆలయంలో బుధవారం స్థానికుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులందరూ భక్తిశ్రద్ధలతో జాంబవంతుడికి అభిషేకాలు, అర్చనలు చేసి పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

రామాపురం : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఎస్‌ఐ వి.లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలన్నగారి పల్లె బ్రిడ్జి వద్ద వంకలో మంగళవారం ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో తన సిబ్బందితో కలిసి వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

విజయవంతమైన జాబ్ మేళా



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాలలో జరిగిన మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన జాబ్ మేళా బుధవారం విజయవంతమైంది. జాబ్ మేళాలో 70 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో మొదటి, రెండో రౌండ్ పూర్తి చేసుకొని మూడో రౌండ్‌కు 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు కంపెనీ వారు నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య, అధికారి వెంకటప్రసాద్, పి.శ్రీనివాసులు, గురుసాయి, సుబ్రమణ్యం, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాత కుటుంబ సభ్యులు

రామాపురం : మండలంలోని బండపల్లి పంచాయతీలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో బుధవారం గాలివీడు మండలం నూలివీడు పంచాయతీ నక్కలవాండ్లపల్లెకు చెందిన ఎస్.వీరాంజనేయులు, మల్లికార్జునలు తమ తల్లి పార్వతమ్మ 3వ వర్ధంతి సందర్భంగా వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వృద్ధులకు అన్నదానం చేసే అవకాశాన్ని లయన్స్ క్లబ్ శివారెడ్డి, జోనల్ చైర్మన్ మహమ్మద్‌లు కల్పించారని, తమ కుటుంబంలో ఎలాంటి వేడుకలు జరుపుకున్న సమాజానికి ఉపయోగపడేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రకమంలో చాంద్‌బాషా, రామ్మోహన్, ప్రేమాలయం సిబ్బంది, పార్వతమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాలుర బీసీ గురుకులాన్ని నిర్మించాలి



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న వేణుగోపాల్

నందలూరు : మండలంలో బీసీ బాలుర గురుకుల పాఠశాలను నిర్మించాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కోరారు. బుధవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రాజంపేట నియోజకవర్గంలో అధిక సంఖ్యలో బీసీ విద్యార్థులు ఉన్నారని వారికి అనుగుణంగా నందలూరు మండలంలో బీసీ గురుకుల పాఠశాలను నిర్మించాలని కోరానన్నారు. నందలూరులో అన్ని వసతులు, ప్రభుత్వ స్థలం, మంచి వాతావరణం, స్వచ్ఛమైన నీరు అన్నింటికీ అనువుగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయమై మంత్రి సవిత సానుకూలంగా స్పందించారని చెప్పారు.

గ్రామగ్రామాన భక్తి శ్రద్ధలతో మొహర్రం వేడుకలు

- ఊరేగింపుగా ఏటికి చేరుకున్న పీర్లు
- చెక్కరతో చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి మండలాల్లోని కోడూరు, రాఘవరాజపురం, రెడ్డివారిపల్లి, వైకోట గ్రామాలలో మొహర్రం వేడుకలు ముస్లింలు, హిందువులు ఐకమత్యంగా బుధవారం నిర్వహించుకున్నారు. రెండురోజులపాటు జరుగుతున్న పీర్ల పండుగలో భాగంగా గ్రామాలలో పీర్లను ఊరేగించి తెల్లవారుజామున గుండలో ప్రవేశం చేశారు. సాయంత్రం నిమజ్జనంలో భాగంగా ఏటికి తరలించారు. ముఖ్యంగా పట్టణంలోని టోల్‌గేట్‌వద్ద పీర్ల పండుగను కోలాహలంగా జరుపుకున్నారు. పలువురు భక్తులు మొక్కుబడులు తీర్చుకొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు

సంబేపల్లె : మొహర్రం వేడుకలు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో భక్తి శ్రద్ధల నడుమ రెండు రోజులుగా సాగాయి. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాలలో బుధవారం తెల్లవారుజామున సరిగెత్తు వేడుకలు ఘనంగా జరిగాయి. పీర్లదేవుళ్ల గ్రామాల్లో ఊరేగించారు. పీర్లకు భక్తులు చెక్కర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.

ఘనంగా పీర్ల ఊరేగింపు

రాజంపేట టౌన్ : గత వారం రోజులుగా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా జరిగిన పీర్ల ఉత్సవాలు బుధవారం మొహర్రం పండుగతో ముగిశాయి. మొహర్రం పండుగను పురస్కరించుకొని ఆయా పీర్ల ఉత్సవ కమిటీ ప్రతినిధులు పీర్లను ఆనందోత్సాహాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా దారివెంబడి భక్తులు పీర్లకు చదివింపులు చదివించారు. కాగా పీర్ల ఊరేగింపులో యువకులు దారివెంబడి డ్రమ్స్ వాయిద్యాలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. దీంతో ఆయా ప్రాంతాల్లో కోలాహల వాతావరణం నెలకొంది.

గ్రామోత్సవంగా ఏటికి వెళ్లిన పీర్లు

పుల్లంపేట : హిందూ ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే మొహర్రం వేడకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మండలంలోని దళవాయిపల్లి గ్రామంలో బుధవారం పీర్లు గ్రామోత్సవంగా ఏటికి వెళ్లాయి. మంగళవారం రాత్రి అనేక మంది భక్తులు అగ్ని గుండ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు. బుధవారం సాయంత్రం పీర్లను ఏటికి సాగనంపారు. ప్రతి ఏడాది ఈ పండుగను దళవాయిపల్లి గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం విశేషం.



చిట్వేలి: పీర్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు



పుల్లంపేట: గ్రామోత్సవంగా ఏటికి వెళ్తున్న పీర్లు



రైల్వేకోడూరు అర్బన్: టోల్‌గేట్‌వద్ద ఊరేగుతున్న పీర్లు

చిట్వేలిలో..

చిట్వేలి : ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే మొహర్రం వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పదిరోజులపాటు నిర్వహిస్తున్న వేడుకలలో భాగంగా బుధవారం ఉదయం పీర్లు అగ్నిగుండలో ప్రవేశించాయి. అలానే భక్తులు గుండంలోకి ప్రవేశించి మొక్కులు తీర్చుకున్నారు. పీర్లకు భారీ ఎత్తున పూలబాసికాలు వేసి నైవేద్యాలు సమర్పించారు. అలాగే మండలంలోనే నేతివారిపల్లి, నగిరిపాడు, కస్తూరివారిపల్లిలో మొహర్రం వేడుకలు నిర్వహించి అన్నదానాలు చేశారు. అనంతరం మేళతాళాల మధ్య పీర్లను గ్రామోత్సవంగా ఏటికి సాగనంపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, ముస్లిం మతపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన మొహర్రం వేడుకలు

లక్కిరెడ్డిపల్లె : కులమతాలకు అతీతంగా నిర్వహించే పండుగ మొహర్రం పీర్ల పండుగ. బుధవారం మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె, కుర్నూతల, పందిళ్లపల్లి తదితర గ్రామాలలో పీర్ల పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. వారం రోజుల నుంచి భక్తి శ్రద్ధలతో పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీర్లకు బాసికాలు సమర్పించి ఆయా గ్రామాలలోని పురవీధులలో బాణాసంచా పేల్చుతూ పీర్లను ఊరేగించారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లిన పీర్లను ఆయా గ్రామాల సమీపంలోని నీరు ఉన్న ప్రాంతంలోకి తీసుకువెళ్లి జలది కార్యక్రమాన్ని జరిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



చిన్నమండెం: గంధపు పీరును ఊరేగిస్తున్న దృశ్యం

వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లి (రైల్వేకోడూరు అర్బన్) : నియోజకవర్గ పరిధి ఓబులవారిపల్లె మండలంలోని వైకోట, నూకనపల్లి గ్రామాలలో జరిగిన పీర్ల పండుగలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ కలసిమెలసి మొహర్రం వేడుకలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలాజీ, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం వేడుకలు

పెనగలూరు : మండలంలో గత నాలుగు రోజులుగా జరిగిన మొహర్రం వేడుకలు బుధవారం అత్యంత ఘనంగా ముగిశాయి. మండలంలోని పెనగలూరు, నల్లపరెడ్డిపల్లి, ఓబిలి, చక్రంపేట, నాయుడువారిపల్లి గ్రామాలలో ఈ పీర్ల పండుగను అత్యంత ఘనంగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున అన్ని గ్రామాలలో అగ్ని గుండం తొక్కారు. సాయంత్రం పీర్లను ఏటికి సాగనంపారు. గత నాలుగు రోజులుగా ప్రతిరోజు రాత్రులలో భక్తులు పీర్ల వద్దకు బెల్లం, చెక్కర, బొరుగులను తీసుకువచ్చి తమ మొక్కులను తీర్చుకున్నారు.



చిన్నమండెం: పీర్లమకాన్‌లో చదివింపులు చదువుతున్న పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ఆరీఫుల్లా హుసేని

అంగరంగ వైభవంగా బాసిక మహోత్సవం

చిన్నమండెం : మొహర్రం ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో మంగళవారం రాత్రి బాసిక మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కడప పెద్ద దర్గా పీఠాధిపతి హజరత్ ఆరీఫుల్లా హుసేని చేతుల మీదుగా బాసికాలను పీర్లకు సమర్పించగా అనంతరం ఆయన స్వయంగా చదివింపులను చదివించారు. అంతకు మునుపు గంజేషాహిద్ దర్గా నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో, బాణాసంచాలతో అంగరంగ వైభవంగా బాసిక మహోత్సవం జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : మొహర్రం పండగ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలల్లో బండపల్లి, రాచపల్లి, హసనాపురం, దూదేకులపల్లి, కుమ్మరపల్లి గ్రామాలలో మొహర్రం పండగను బుధవారం ఆయా గ్రామాల ప్రజలు హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఘనంగా నిర్వహించారు. పీర్లచావిడిలలో పీర్లను ఏర్పాటు చేసి తొమ్మిది రోజుల నుంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విశేషంగా పీర్ల పండగను జరుపుకొని సాయంత్రంగా పురవీధుల్లో పీర్లను ఊరేగింపుగా తీసుకొని జలది కార్యక్రమానికి తీసుకెళ్లారు.



రామాపురం: గంగనేరులో పీర్లచావిడి నుంచి నిమజ్జనానికి వెళ్తున్న పీర్లు



సంబేపల్లె: ప్రత్యేక అలంకరణలో కొలువైన పీర్లు



పెనగలూరు: ఏటికి సాగిపోతున్న పీర్లు



ఓబులవారిపల్లె(రైల్వేకోడూరు అర్బన్): పీర్ల పండుగలో పాల్గొన్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్



రాజంపేట టౌన్: పట్టణంలో పీర్లను ఊరేగిస్తున్న యువకులు



ఓబులవారిపల్లె మండలం వైకోట గ్రామంలో కోలాహలంగా పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

24 నుంచి శీతల గంగమ్మ జాతర

సిద్దవటం : మండలంలోని పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి 21వ జాతర మహోత్సవ కార్యక్రమం ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని దేవస్థానం కమిటీ వారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శీతల గంగమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకొని ఆలయాన్ని రంగులతో అలంకరించి తిరునాలకు ముస్తాబు చేశారు. ఈనెల 24వ తేదీన అమ్మవారికి పాలాభిషేకం, అలంకరణ, పొంగళ్లు, శక్తి పూజ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదే రోజు రాత్రి అమ్మవారి కథ, అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా ఆలయానికి చేరుస్తామన్నారు. 25వ తేదీన గంగమ్మకు అభిషేకం, అలంకరణ, అమ్మవారి దర్శనం, పొంగళ్లు, నైవేద్యం వంటి పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. గ్రామ పొలిమేరలో అమ్మవారి ప్రతిమను నిమజ్జనం చేస్తారని కమిటీ వారు తెలియజేశారు. జాతరలో భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.



శీతల గంగమ్మ మూలవిరాట్

పేదల సొంతింటి కలను సాకారం చేశాం

రాజంపేట టౌన్ : మండలంలోని సున్నపురాళ్లపల్లె జగనన్న కాలనీలో రామ్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వెంకటేష్ నిర్మించుకున్న జగనన్న ఇంటిని బుధవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేసేందుకు జగన్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రంలో లక్షలాది మందికి ఇళ్లస్థలాలు ఇచ్చి గృహాలు మంజూరు చేశారన్నారు. అందువల్ల లక్షలాది మంది పేదలు సొంతింటి కలను సాకారం చేసుకున్నారన్నారు. వివిధ కారణాల రీత్యా కొంత మంది ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోలేదని, అందువల్ల పేద ప్రజలు గృహాలు పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పేదల పట్ల వివక్షత చూపితే సహించేది లేదన్నారు. పేద ప్రజలకు మేలు జరిగేందుకు వారికి అండగా నిలిచి ఎంతవరకైనా పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాపినేని విశ్వనాథ్‌రెడ్డి, దండు గోపి తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఇంటిని ప్రారంభిస్తున్న పోలా శ్రీనివాస్‌రెడ్డి, ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి

అత్యాచారాలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

రాజంపేట టౌన్ : రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్ దుయ్యబట్టారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ స్థానిక మార్కెట్ సర్కిల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటు రాష్ట్రంలోను అటు దేశంలోను ప్రతి గంటకు మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు అనేకం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో మహిళలపై జరిగిన ఘటనలకు కారకులైన వారిని వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలని కఠినంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని చెప్పారు. ప్రస్తుతం మహిళలపై జరుగుతున్న సంఘటనలపై మహిళలు ఉద్యమించాలని కోరారు. మహిళల హక్కుల పరిరక్షణకు భారత కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడు ముందుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం, ఎస్ఎఫ్‌ఐ, కేవీపీఎస్ నాయకులు నరసింహ, నారాయణ, జంగయ్య, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపడుతున్న కమ్యూనిస్టు పార్టీ నాయకులు

వైభవంగా తొలి ఏకాదశి పూజలు

సంబేపల్లె : మండలంలోని శెట్టిపల్లె గ్రామం పంచాయతీ అడవికమ్మపల్లెలో కొలువైన శ్రీ లక్ష్మీవేంకటేశ్వర ఆలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మార్మోగింది. వచ్చిన భక్తులు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు

రాజంపేట టౌన్ : నియోజకవర్గంలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను హిందువులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అనేక మంది వేకువజామునే స్నానాలాచరించి సమీపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. తొలి ఏకాదశిని పురస్కరించుకొని ఆయా ఆలయాల్లో స్వామి వారి మూలవిరాట్‌లను ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. పురోహితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పెనగలూరులో..

పెనగలూరు : మండలంలోని పలు ఆలయాలలో బుధవారం ఆషాఢమాసం తొలి ఏకాదశి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెనగలూరు వెంకటేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాలస్వామి ఆలయం, సింగనమల శివాలయం, ఈటమాపురం పెంచలకొండ పైన రేణుకా ఎల్లమ్మ ఆలయం, తూర్పుపల్లి వద్ద ఉన్న బోడమల్లేశ్వరస్వామి ఆలయం, కోమంతరాజుపురం వద్ద నాగమల్లేశ్వరస్వామి ఆలయాలలో ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలో బుధవారం తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తులకు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. తొలి ఏకాదశి ప్రీతికరమైన మహావిష్ణువు దేవాలయాలు అత్యంత శోభ సంతరించుకున్నాయి. ప్రధానంగా బండపల్లి సమీపంలో ఉన్న కంభరాయిని కొండపై వెలసిన మహావిష్ణు దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ముక్కోటి బసిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. గువ్వలచెరువు ఘాట్ రోడ్డు, నల్లగుట్టపల్లి, హసనాపురం తదితర ప్రాంతాల్లోని శివాలయంలో పూజలను నిర్వహించారు. బుధవారం దక్షిణాయన ప్రారంభవుతున్న దృశ్య తొలి ఏకాదశి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు.



సంబేపల్లె: ప్రత్యేక పూజలందుకున్న వేంకటేశ్వరుడు



రామాపురం: ప్రత్యేక అలంకరణలో మహావిష్ణువు మూలవిరాట్



పెనగలూరు: ఆలయంలో ఏకాదశి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రాజంపేట టౌన్: స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

పింఛా పనులు వేగవంతం చేయాలి

సుండుపల్లె : రైతులకు ప్రయోజకరంగా ఉండే విధంగా ప్రాజెక్టు పనులు వేగవంతం చేసి ఆదుకోవాలని రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుగవాసి సుబ్రమణ్యం పేర్కొన్నారు. బుధవారం వారు మండల పరిధిలోని ముడుంపాడులో ఉన్న పింఛా ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ గతంలో పింఛా ప్రాజెక్టు కొట్టుకుపోయి ఈ ప్రాంత రైతులకు సాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు.

ప్రస్తుతం ప్రాజెక్టు పనులు చేస్తున్నారని, అయితే రైతులకు ఉపయోగపడే విధంగా పనులు పూర్తి చేయాలన్నారు. గతంలో ప్రాజెక్టు తూర్పు భాగాన అనేక గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం ఉండేదని, ప్రస్తుతం దారిలేకపోవడంతో గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని తమ దృష్టికి తీసుకువచ్చారని, కావున రహదారి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పింఛా ప్రాజెక్టును సందర్శిస్తున్న టీడీపీ నేత సుగవాసి సుబ్రమణ్యం